ఆక్విడేటర్లకు మరమ్మతులేవీ?

- పలుచోట్ల లీకేజీలు
- ఆయకట్టుకు చేరని మానేరు సాగునీరు
- వానకాలం ముందైన మరమ్మతులయ్యేనా?
- ప్రతిపాదనలకు మోక్షమెప్పుడో?

ముస్తాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టుతో పుష్కలమైన సాగునీటి వనరులున్నా, చివరి ఆయకట్టుకు సాగునీరందించే కెనాల్స్‌, తూములు, షట్టర్లు మాత్రం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వానకాలం పంటల సాగుకు ముందే జలవనరులను మరమ్మతులు చేయాలని రైతాంగం కోరుతోంది. నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు కింద ముస్తాబాద్‌ మండలంలో 12 వేల ఎకరాల ఆయకట్టు వుంది. నిజాం కాలం నాటి ఈ ప్రాజెక్టు కింద ఉన్న కెనాల్స్‌ ప్రస్తుతం చివరి ఆయకట్టుకు సాగునీరందించే పరిస్థితుల్లో లేవు. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖ అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే ప్రకారం చేసిన అంచనాలకు మంజూరు దక్కాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఆక్విడేటర్‌ లీకేజీతో నీటి కుంటను తలపిస్తున్న దృశ్యం


లీకేజీ అవుతున్న ఆక్విడేటర్‌


శిథిలమవుతున్న మానేరు కెనాల్‌ ఆక్విడేటర్‌

ఆయకట్టుకు అందని సాగునీరు

ఎగువ మానేరు ప్రాజెక్టు నుంచి ముస్తాబాద్‌ మండలంలోని తెర్లుమద్ది చివరి గ్రామం వరకు కెనాల్‌ ఉంది. 34 కిలోమీటర్ల కుడి కాలువకు చాలా చోట్ల ధ్వంసమైంది. లోతు చెరువు వద్ద కెనాల్‌కు గండ్లు పెట్టడంతో పూర్తిస్థాయి నీటి మట్టం లేకుండా పోతోంది. అలాగే గోపాల్‌పల్లె వద్ద వున్న ఆక్విడేటర్‌ పూర్తిగా శిథిలమైంది. రాంరెడ్డిపల్లె, బండలింగంపల్లి, నామాపూర్‌ వద్ద పలు చోట్ల షట్టర్లు ధ్వంసమయ్యాయి. కొండాపూర్‌, ఆవునూర్‌, గూడెం గ్రామాలకు వెళ్లే సబ్‌ కెనాల్స్‌ చాలా చోట్ల మరమ్మతుకు గురవుతున్నాయి. గూడూరు నుంచి తెర్లుమద్ది వరకు సిల్ట్‌, చెత్త, తుంగ, గుర్రపు డెక్క భారీగా పేరుకుపోయింది. ముస్తాబాద్‌లో పట్టణ మురుగు అంతా కెనాల్‌లోకి వస్తోంది. ఇక రత్నాల కుంట నుంచి తెర్లుమద్దికి వెళ్లే రెండు ఆక్విడేటర్లు భారీగా లీకవుతున్నాయి. దీంతో తెర్లుమద్ది కెనాల్‌కు నీరు వెళ్లడం గగనంగా మారింది. ముఖ్యంగా డిస్ట్రిబ్యూటరీ–15 పూర్తిగా ధ్వంసమైంది. ముస్తాబాద్‌, పోత్గల్‌ గ్రామాల మధ్య ఉన్న డీ–18 వద్ద వంతెన పూర్తిగా కూలిపోయింది. ఇక్కడి షట్టర్లు ఎందుకు పనికిరాకుండా పోయాయి. డీ–16 వద్ద కెనాల్‌పై నుంచి వానకాలంలో నీరు వెళ్లడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే గోపాల్‌పల్లె, బండలింగంపల్లి గ్రామాల మధ్య మానేరు కెనాల్‌పై వంతెన ఇరుకుగా మారి శిథిలమైంది.

ప్రతిపాదించిన పనులు

- ➡ గోపాల్‌పల్లె ఇరుకు వంతెనకు రూ.12.95 లక్షలు
- ➡ పోతుగల్‌ కెనాల్‌పై వంతెన నిర్మాణానికి రూ.10.50 లక్షలు
- ➡ గోపాల్‌పల్లెలో ఆక్విడేటర్‌ నిర్మాణానికి రూ.36 లక్షలు
- ➡ గూడూరు నుంచి ముస్తాబాద్‌ వరకు కెనాల్‌లో పేరుకుపోయిన సిల్ట్‌, గుర్రపు డెక్క తొలగించేందుకు రూ.6 లక్షలు
- ➡ డీ–15 షట్టర్‌ మరమ్మతుకు రూ.6.8 లక్షలు
- ➡ ముస్తాబాద్‌లో ఆక్విడేటర్ల మరమ్మతులకు రూ.3 లక్షలు

నిధుల మంజూరుపై ఆశ

చాలాకాలంగా ఎగువ మానేరు కెనాల్స్‌, షట్టర్లు మరమ్మతులు చేయాలన్న రైతుల డిమాండ్‌ నెరవేరడం లేదు. మంత్రి కేటీఆర్‌కు రైతులు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నెలలోనే మంజూరు వస్తుందని ఆశిస్తున్నారు. ఇటీవల నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ క్షేత్రస్థాయిలో వీటన్నింటిని పరిశీలించారు. మంత్రి ఆదేశాల మేరకు ఈఎన్‌సీ చేసిన సర్వేకు నిధుల మంజూరు వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ వానకాలం పంటల సాగుకు ముందే నిధులు మంజూరు ఇప్పించి, పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు అధికారులు సైతం పూర్తిస్థాయి కసరత్తు చేపట్టారు.

కాలువలు బాగు చేయాలి



మానేరు కాలువలను మరో నెల రోజుల్లో మరమ్మతులు చేపట్టాలి. ప్రస్తుతం రైతులు వానకాలం పంటలకు సిద్ధం అవుతున్నారు. చివరి వరకు మానేరు నీరు వెళ్లాలంటే కాలువలు బాగు చేయాలి. రైతులకు సాగుకు ముందే భరోసా కల్పించాలి.

– కొండం రాజిరెడ్డి, రైతు, నామాపూర్‌

పంటలు మునుగుతున్నాయి



ప్రతి వానకాలంలో మానేరు కాలువలు పొంగుతున్నాయి. ముస్తాబాద్‌ వద్ద కెనాల్స్‌ షట్టర్లు ఫెయిలవడంతో నీరు కిందకు వెళ్లలేక, ఎగువనున్న కెనాల్‌లోకి రివర్స్‌ వస్తున్నాయి. కాలువ మీది నుంచి పంట పొలాల్లోకి నీరు వచ్చి పంటలను ముంచుతున్నాయి. కెనాల్‌ కరకట్ట మరమ్మతు చేయాలి.

– కుంబాల రాజిరెడ్డి, రైతు, ముస్తాబాద్‌

నిధులు మంజూరవుతాయి



ఇటీవల నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిధులకు ప్రతిపాదనలు చేశాం. జూన్‌లోగా నిధులకు మంజూరు వస్తుందని ఆశిస్తున్నాం. రైతుల విజ్ఞప్తి మేరకు పనులు త్వరగా చేపడుతాం. ఆక్విడేటర్లు, వంతెనలు నిర్మిస్తాం. మైనర్‌ పనులు సైతం పూర్తి చేస్తాం.

– రవికుమార్‌, డీఈఈ, ముస్తాబాద్‌

క్లుప్తంగా

ఓటర్‌ నమోదు సజావుగా పూర్తిచేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్‌ తఫజుల్‌హుస్సేన్‌

వీర్నపల్లి: మండలంలోని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్‌ తఫజుల్‌ హుస్సేన్‌ అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుతో నాయకులను ఎన్నుకునేందుకు వీలుకలుగుతుందన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 23 వరకు ఓటర్‌ నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ప్రతి గ్రామంలో సంబంధిత అధికారులు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్‌ ఎల్సాని ప్రవీణ్‌కుమార్‌, ఆర్‌ఐ ప్రవీణ్‌ పాల్గొన్నారు.

వీధి కుక్కల బారినుంచి కాపాడాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్‌: వీధి కుక్కల బారినుంచి పట్టణ ప్రజలను కాపాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు మున్సిపల్‌ కమిషనర్‌ వెల్దండి సమ్మయ్యకు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం మాట్లాడుతూ రోజు రోజుకు పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువవుతోందన్నారు. ఎంతోమందిని కరుస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు అజ్జ వేణు, మంచికట్ల రమేశ్‌, ఒడ్డెపల్లి లక్ష్మణ్‌, బుర్ర మల్లేశం, గాజుల లింగమూర్తి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వసతుల కల్పనకు ప్రాధాన్యం


వివరాలు తెలుసుకుంటున్న డీపీవో ఉమాదేవి

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్‌ పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి ఉమాదేవి అన్నారు. మండలంలోని విలాసాగర్‌ పీహెచ్‌సీ కేంద్రాన్ని ఎంపీపీ వర్లపల్లి వేణుగోపాల్‌తో కలిసి మంగళవారం సందర్శించి మాట్లాడారు. వసతుల కల్పనకు నేషనల్‌ హెల్త్‌ మిషన్‌ నుంచి రూ.5 లక్షలు, కలెక్టర్‌ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సరైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నల్ల రాజేందర్‌రెడ్డి, వైద్యాధికారిని అనిత, హెల్త్‌ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌, నాయకులు జూలపల్లి అంజన్‌రావు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం


తంగళ్లపల్లిలో..


వేములవాడలో..

తంగళ్లపల్లి/వేములవాడఅర్బన్‌/ముస్తాబాద్‌: సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయాల ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ దోపిడీ లేని సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. వివిధ రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికవర్గానికి అండగా ఉంటుందన్నారు. ముస్తాబాద్‌లో సీఐటీయూ మండల అధ్యక్షుడు బిక్షపతి, వేములవాడ మున్సిపల్‌ కార్యాలయం ఎదుట సీఐటీయూ, మున్సిపల్‌ వర్కర్స్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్‌ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో నాయకులు అన్నల్దాస్‌ గంగాధర్‌, గోరంతల రాజమల్లు, మర్కటి నర్సయ్య, అవధూత హరిదాస్‌, సతీశ్‌, వేణు, శ్రీనివాస్‌, విష్ణు, లచ్చయ్య, శ్రీనివాస్‌, శంకర్‌, రాజు, మమత, పద్మ, నాయకులు యాదగిరి, కుర్ర రాకేశ్‌, నర్సింలు పాల్గొన్నారు.

అటెన్షన్‌ ప్లీజ్‌



రోడ్డు దిగితే ప్రమాదమే

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ నుంచి సనుగుల వరకు, హన్మాజీపేట నుంచి ఎన్గల్‌, బండపల్లి మీదుగా బావుసాయిపేట గ్రామాల రోడ్లు దెబ్బతినడంతో తారువేయడంతో రోడ్డు ఎత్తు పెరిగింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న సైడ్‌బర్మ్‌లు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఎదురెదురుగా వస్తే రోడ్డు దిగాలన్నా, తిరిగి ఎక్కాలన్నా అనువుగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా అధికారులు రోడ్డుకు సమాంతరంగా గ్రావెల్‌ వేయించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : సతీశ్‌, ఆర్‌అండ్‌బీ ఏఈ, చందుర్తి
సెల్‌ నెంబర్‌ : 94408 18862

పవర్‌ కట్‌

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్‌: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట సబ్‌స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతు ఉన్నందున బుధవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్‌ ఏఈ మధుకర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు భవానా ఋషినగర్‌, విద్యానగర్‌, సుభాష్‌నగర్‌, గాంధీచౌక్‌, గాంధీనగర్‌, శాంతినగర్‌, శ్రీనగర్‌కాలనీ, రగుడు, సిద్ధార్థనగర్‌, అంబేద్కర్‌నగర్‌, కలెక్టరేట్‌ ఏరియా, దోబీగల్లి, మార్కండేయవీధి, పత్తిపాక వీధి, ఆటో నగర్‌, పాత బస్టాండ్‌, సివిల్‌ హాస్పిటల్‌ ఏరియా, పత్తిపాక వీధి, విమల్‌ టాకీస్‌, లక్ష్మీ టాకీస్‌ ఏరియా, అశోక్‌నగర్‌ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాచారం

నేడు మున్సిపల్‌ సమావేశం

సిరిసిల్లటౌన్‌: పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు సిరిసిల్ల మున్సిపల్‌ కమిషనర్‌ వెల్దండి సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని కౌన్సిల్‌ సమావేశం మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్‌ జిందం కళ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్‌ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశం అనంతరం ప్రెస్‌మీట్‌లో వివరాలను తెలియజేస్తామన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

ముస్తాబాద్‌: మండలంలోని మొర్రాపూర్‌ తండాలో యాడి జగదాంబదేవి, సేవాలాల్‌ మహారాజ్‌ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. మూల మంత్రజపం, తర్పణం, స్థాపితా దేవతాపూజ, ఆదివాస, దుర్గ హవనం, పారాయణం చేశారు. విగ్రహ, యంత్ర ప్రతిష్ఠాపనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్‌ దేవేందర్‌నాయక్‌, విఠల్‌నాయక్‌, కపూర్‌నాయక్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

రేణుక-జమదగ్ని కల్యాణం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుకా జమదగ్ని కల్యాణ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు పోచమ్మ బోనాలు తీసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించిన అనంతరం కల్యాణ వేడుకలను నిర్వహించారు. గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండ రమేశ్‌, మండల నాయకులు లక్ష్మణ్‌, కార్తీక్‌, భాస్కర్‌ పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిక


బీఎస్పీలో చేరిన యువకులు

సిరిసిల్లఅర్బన్‌: బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్‌, రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యుడు ఎనగందుల ఎంకన్న ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు యువకులు బీఎస్పీలో చేరారు. మంగళవారం బీఎస్పీ కార్యాలయంలో యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం నూతనంగా నియామకమైన పట్టణాధ్యక్షుడు తడుక భాను, జిల్లా ఇన్‌చార్జి అరుకల రమేష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో బహుజన సమాజ్‌ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్‌, ప్రచార కార్యదర్శి యారపు రాజబాబు, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు లింగంపల్లి మధుకర్‌, నరేందర్‌, ఆంజనేయులు, రాజు, మేర్గు రాజు, శ్రీను, కమలాకర్‌, రమేష్‌, నాగరాజు, ఆడెపు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వర్షం.. అన్నదాత ఆగం

- తడిసి ముద్దయిన ధాన్యం బస్తాలు
- ఆందోళనలో అన్నదాతలు



రుద్రంగి: ఈ రైతు పేరు లావుడ్య రవి, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఈ రైతు ధాన్యాన్ని 15 రోజుల క్రితం తూకం వేశారు. లారీలు రాకపోవడంతో మిల్లుకు తరలించలేదు. సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ఉదయాన్నే వాటిని తిర్రమర్ర చేసి ఆరబెట్టేందుకు నలుగురు కూలీలను పెట్టి చేయిస్తున్నాడు. వచ్చే డబ్బులు కైకిళ్లకే అయ్యేట్లు ఉన్నాయని ఆందోళన చెందుతున్నాడు. లారీలు వచ్చి మిల్లుకు తరలిస్తే ధాన్యం తడిసేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న బర్కం నవీన్‌

రుద్రంగి మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం, తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. కొనుగోళ్లలో నిర్లక్ష్యంతోనే కష్టపడి ఆరబెట్టిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టే పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలు రాకపోవడంతోనే కొనుగోళ్లు మందగించాయని, లేదంటే ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయి ఉండేదని, అధికారులు చర్యలు తీసుకొని లారీలు వచ్చేలా చూసి త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని కోరుతున్నారు.

కొనుగోళ్లు పూర్తిచేయాలి


తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న నాయకులు

రుద్రంగి: కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు అరిగోస పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం చోద్యం చూస్తున్నారని బీఎస్పీ మండల అధ్యక్షుడు కట్కూరి శంకర్‌ ఆరోపించారు. రెండు నెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతున్నారని, లారీలు ఉంటే, గన్నీబ్యాగ్స్‌ ఉండవు, అన్ని ఉంటే తూకం వేయరూ, కనీస ముందుచూపు లేకుండా రైతన్నను ప్రభుత్వం ఆగం చేస్తుందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి త్వరితగతిన కొనుగోళ్లు పూర్తిచేయాలని డిమాండ్‌ చేశారు. లేకుంటే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు కట్కూరి రమేశ్‌, అనిల్‌ పాల్గొన్నారు.

డీటీకి వినతిపత్రం

చందుర్తి: ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్‌ లీలారాణికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోహిణి కార్తె ప్రారంభమై వారం రోజులు గడిచిన కొనుగోలు కేంద్రాల్లో ఇంకా సగానికిపైగా ధాన్యం ఉందన్నారు. లారీల కొరత పేరిట జాప్యం చేస్తే ఇంకా నెల రోజులు గడిచిన గ్రామాల్లోని ధాన్యం కాంటా కాలేదని ఆవేదనను వ్యక్తం చేశారు. 45 రోజులుగా రైతులు కేంద్రాల్లో ధాన్యంతో పడిగాపులు గాస్తున్న పట్టించుకునే వారు లేకుండా పోయారని ఆరోపించారు.

‘యువత సంక్షేమానికి కాంగ్రెస్‌ పెద్దపీట’

సిరిసిల్లటౌన్‌: యువత సంక్షేమానికి ఆది నుంచి కాంగ్రెస్‌ పార్టీ పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల నియోజవకవర్గానికి మంత్రి కేటీఆర్‌ చేసిందేమి లేదని విమర్శించారు. కొనుగోలు సెంటర్లలో ధాన్యం కుప్పలను కొనకుండా వర్షానికి రైతుల రెక్కల కష్టం కొట్టుకుపోతుంటే చోద్యం చూస్తున్నాడని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలోని ప్రజల పక్షాన తమ పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఇక యువతలో చైతన్యం రగిలించేలా హైదరాబాద్‌ యూత్‌ డిక్లరేషన్‌ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొపే దిశలో జూన్‌ 18న ఆన్‌లైన్‌ ద్వారా క్విజ్‌ పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ బహుమతులు గెలుపొందాలని కోరారు. యూత్‌ విభాగం జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్‌, ఎద్మల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఉమేశ్‌రావు

ప్రమాద సూచికలు ఏర్పాటు



కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న స్థలాల్లో ఎస్సై రమాకాంత్‌ ఆధ్వర్యంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. మండలంలోని కొలనూర్‌, మర్తనపేట, కోనరావుపేట క్రాసింగ్‌ తదితర ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కోనరావుపేట మండలం కొలనూర్‌, మర్తనపేట తదితర గ్రామాల రహదారులపై ఐదు ప్రాంతాల్లో సైన్‌ బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యుత్‌ స్తంభాలకు ఎర్రని రేడియం స్టిక్కర్లను అతికించారు. వీటి వల్ల వాహనాలకు రేడియం కనబడడంతో ప్రమాదాలు తగ్గే అవకాశముందన్నారు.

షార్ట్‌ ఫిల్మ్‌ షూటింగ్‌



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పల్లవి డిజిటల్‌ స్టూడియోలో మంగళవారం ఒక షార్ట్‌ఫిల్మ్‌ షూటింగ్‌ చేశారు. వేల్పుల శివ బృందం ఆధ్వర్యంలో నటీనటులు భ్రమరాంబిక, శివపై కొన్ని షాట్స్‌ చిత్రీకరించారు. షూటింగ్‌ చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. కెమెరామెన్‌ శివ, ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, బాబు, రమేశ్‌, భరత్‌, మల్లేశ్‌, వరుణ్‌ పాల్గొన్నారు.

పోస్టర్‌ విడుదల

ఇల్లంతకుంట: జూన్‌ 4న కొత్తగూడెంలో జరగబోయే సీపీఐ బహిరంగ సభ పోస్టర్‌ సీపీఐ నాయకులు మంగళవారం తాళ్లపల్లిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సావనపెల్లి మల్లేశం మాట్లాడుతూ బహిరంగ సభ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సీపీఐ నాయకులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మల్లేశం, సదానందం, మల్లయ్య, శంకర్‌, రాజశేఖర్‌, రాజేందర్‌, బాలమల్లు తదితరులున్నారు.

పరామర్శ

వేములవాడరూరల్‌: వేములవాడ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలకు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ పరామర్శించారు. నమిలిగుండుపల్లి, ఎదురుగట్ల, వట్టెంల గ్రామాల్లో ఆయన పర్యటించి వారి కుటుంబాలను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. రూరల్‌ పార్టీ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్‌, ఎంపీటీసీ రంగు వెంకటేశం, సర్పంచ్‌ కరుణాకర్‌ పాల్గొన్నారు.